

# బ్లాక్ మార్కెట్

సూర్యప్రసాదరావు

"సినిమా చూద్దామా" చంద్రం అడిగాడు సూర్యాన్ని.

"ఇప్పుడా సినిమానా?" సందిగ్ధంగా సూర్యం చూశాడు.

"అవును. ఇప్పుడే ఇక్కడే. ఆ వాల్‌పోస్టర్లు చూడు ఎంత కసి ఎక్కించేలా ఉన్నాయో. చూస్తే ఇదే చూడాలి, ఇప్పుడే చూడాలి"

మద్రాసు మహానగరంలో మే మాసపు చివరి రోజులు. మిట్టమధ్యాహ్నం నిప్పులు చెరిగే ఎండలో సినిమాలు తయారయ్యే ప్రాంతంలో అడ్రస్ కోసం తిరిగి తిరిగి విసిగి వేసారిపోయిన సూర్యానికి ఓ నీడ కావాలనిపించింది. హాయిగా ఫాను కింద ఓ గంట గడిపితే బాగుండుననిపించింది.

"ఈ సినిమా మనకు అర్థం కాదు గదరా!"

"అర్థం కావడానికి తెలుగు సినిమానే చూడాలా? ఆ వాల్‌పోస్టర్లు చూడు. కళ్ళు మిరుమిట్లుగొలిపేలా రంగుల్లో వెదజల్లిన ఆ అందాలు చూడరా. ఆ అందాలను కనులవిందుగా చూడ్డానికైనా మనం ఈ సినిమా చూడాల్సిందే" చంద్రం నిశ్చయంగా అన్నాడు.

అప్పటికే జనం చాలామంది పోగయ్యారు. ఒక్కొక్క వాల్‌పోస్టర్‌ని నిశితంగా చూస్తున్నారు. ఆ వాల్‌పోస్టర్‌లలోని అందాలను కళ్ళముందు సజీవంగా చూడాలంటే ఆ సినిమా టిక్కెట్టు కొనుక్కోవలసిందే.

అప్పటికి మధ్యాహ్నం పదకొండున్నర అయింది. సినిమా పన్నెండు గంటలకు మొదలుపెట్టబడుతుందని వాల్‌పోస్టర్‌లపై తమిళంలో సూచన.

వేసవి సెలవులు సరదాగా గడపడానికి చంద్రం ఇంటికి వచ్చిన సూర్యం చంద్రాన్ని వదలి వెళ్ళలేదు. అందుకే యిష్టం వున్నా లేకున్నా అతని ప్రక్కనే ఆ ఎండలో టిక్కెట్లు ఎప్పుడిస్తారు ఎప్పుడు లోపలకు వెళ్ళనిస్తారు అని ఎదురుచూస్తున్నాడు.

ఇంతలో టిక్కెట్లు యిస్తున్నారన్నట్లుగా కర్ణకఠోరంగా థియేటర్ బెల్ మోగింది. కౌంటర్లన్నీ మూసినవి మూసినట్లుగానే ఉన్నాయి. టిక్కెట్లు ఎక్కడిస్తున్నారో అర్థం కాలేదు.

"తంబీ టిక్కెట్లు ఎంగే?" వచ్చీరాని తమిళంలో చంద్రం ఓ లుంగీని అడిగాడు. అతను చూపించినచోట పెద్ద గుంపు. మధ్యలో టిక్కెట్లు ఇచ్చే రెండు చేతులూ. ఆ గుంపులోకి చంద్రం చొరబడి ఇరవై రూపాయల కాగితం యిచ్చాడు. రెండు టిక్కెట్లు చేతిలోకి వచ్చిపడ్డాయి. టిక్కెట్లు మీద వెల ఆరు రూపాయలని వుంది.

"ఎన్నపా! ఒరు టికెట్టు ఎవళా?" చంద్రం టికెట్టిచ్చేవాడిని అడిగాడు.

"ఒరు టికెట్ పత్తు రూబాయి. బాల్కనీ టిక్కెట్టు" సమాధానం వినిపించింది. బాల్కనీ టిక్కెట్టు వెల కూడా ఏడు రూపాయలే. కానీ ఈ సినిమా టికెట్టు ఖరీదు మాత్రం పదిరూపాయలు.

ఇంతలో సినిమా మొదలౌతున్నట్లుగా మళ్ళీ బెల్ మోగింది.

బాల్కనీ గేటులోకి గుంపంతా ఒకటే పరుగు పరుగు...

తెరపై రంగు రంగుల బొమ్మలు అందాలు ఆరబోస్తుంటే హాలంతా వేడివేడి నిట్టూర్పులు వినవస్తున్నాయి. అందరూ ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

తెరపై స్త్రీ పురుష పాత్రలు మంచి రసపట్టులోకి వస్తున్నాయనగా టప్‌మని ఫిలిం తెగిపోయినట్లు తెల్లని కాంతి తెరపై పడింది. అలా గంట తరువాత వచ్చిన ఇంటర్‌వెల్‌లో నాలుగైదుసార్లలా జరిగింది.

సూర్యం, చంద్రం ముఖంలోకి చూశాడు.

సెంచరీ చేద్దామన్న బ్యాట్స్‌మన్ డక్కౌట్ అయితే ఎంత నిరుత్సాహపడిపోతాడో అంత నీరసంగా ఉంది.

"ఎలా వుందిరా సినిమా?"

సినిమా అయిపోయిన తరువాత బాల్కనీ మెట్లు దిగుతున్న చంద్రాన్ని అడిగాడు.

"నా మొహంలా వుంది. తెరపై ఆడా మగా పాత్రలు దగ్గరకు వస్తే చాలు కత్తిరించేస్తున్నారు. ఇంతకన్నా మామూలు సినిమానే నయం" విచారంగా అన్నాడు.

"చంద్రం చూడరా హాలులోంచి బయటకు వచ్చే ప్రతీ ప్రేక్షకుడి నుండీ టిక్కెట్లు తిరిగి తీసుకుంటున్నారు.. చూడరా.."

"పోనీలేరా మనకెందుకు? ఏదో కాంట్రాక్టు మీద సినిమా వేస్తున్నట్లున్నారు"

"అందుకే ఆరు రూపాయల టిక్కెట్టుకు, ఏడు రూపాయల టిక్కెట్టుకు పది రూపాయలు వసూలు చేశారు. మళ్ళీ టిక్కెట్లు ప్రేక్షకుల నుండి తీసుకుంటున్నారు. ఇదే బ్లాక్ మార్కెట్ అంటే" సూర్యం ఉండబట్టలేక అనేశాడు.

"థియేటర్‌వాళ్ళు చేసి వుండరురా. కాంట్రాక్టర్ అయి వుంటాడు" చంద్రం సినిమాహాలు వాళ్ళను సపోర్టుచేశాడు.

మేనేజర్ రూమ్ ప్రక్క నుండి వస్తుంటే లోపల నుండి వినిపించిన మాటలు ఇద్దరినీ ఆశ్చర్యపరిచాయి.

"నిజమేరా యిదే బ్లాక్ మార్కెటింగ్" చంద్రం ఒప్పుకున్నాడు.

"అందులోనూ ప్రేక్షకుల బలహీనతలను ఆధారంగా చేసుకొని థియేటర్ వాళ్ళు చేస్తున్న ఎక్స్‌ప్లాయిటేషన్.. సెక్స్‌ప్లాయిటేషన్..."

సినిమా తెరపై కనిపించని సీన్లను వాల్‌పోస్టర్లపై చూస్తూ సూర్యం యథాలాపంగా అనేశాడు.

బాల్కనీలోని 400 సీట్ల కెపాసిటీ. క్రింది తరగతిలోని 600 సీట్ల కెపాసిటీ.. బ్లాక్ మార్కెట్ విలువలను అంచనా వేయిస్తుంది. ←